ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 3 | నవంబర్ 2023


**ఈ సంచికలో. . . .**


భగవదనుభవం పొందటానికి అనుగుణంగా జీవించటమే మన జీవిత గమ్యం .................................................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3

శ్రీమద్భగవద్గీత ....................................................... 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం




మీరు ఏదైతే పొందాలనుకుంటున్నారో (హృదయంలో ఉన్న సత్యం), దానికి అనుగుణంగా జీవించండి. మీరు జీవించే భౌతిక స్థితిని ఉపయోగించుకోండి.


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# భగవదనుభవం పొందటానికి అనుగుణంగా జీవించటమే మన జీవిత గమ్యం



(శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములనుండి సేకరణ)

మన జీవితగమ్యం ఏమిటంటే గాడ్ రియలైజేషన్, అంటే భగవదనుభవం. భగవదనుభవం అన్నా ఆత్మ సాక్షాత్కారం అన్నా ఆత్మజ్ఞానం అన్నా ఒకటే, అదే మన జీవితగమ్యం, అది గుర్తుపెట్టుకోండి. మిగతావి అన్నీ స్వప్న సమానం. మనం రెండు విద్యలు నేర్చుకోవాలి. మనకి కాలేజీలలో, యూనివర్సిటీలలో మన పొట్ట పోషించుకోవటానికి సంబంధించిన విద్యలు నేర్పుతారు. దానివల్ల మనకి పొట్ట వెళ్ళిపోతుంది. అది ఒక విద్య. రెండు, ఆత్మవిద్య కూడా మనం నేర్చుకోవాలి. ఆత్మవిద్య నేర్చుకోవటం వల్ల అమృతత్వం వస్తుంది. లౌకిక విద్యలు కూడా విద్యలే. అవి నేర్చుకోవటం వల్ల మన శరీర యాత్ర గడిచిపోతుంది. ఆత్మవిద్య నేర్చుకొంటే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానం కలిగితే అమృతానుభవం కలుగుతుంది. అమృతానుభవం పొందిన వాడు మళ్ళీ ఈ జననమరణ చక్రంలోకి రావలసిన పని లేదు.

మీరు ఏదైతే పొందాలో దానికి అనుగుణంగా మీ జీవితాన్ని తీర్చిదిద్దుకోండి. మీరు నరసాపురం వెళ్ళటానికి నడిచి వెళ్తున్నారు అనుకోండి, నడవటం కోసం నడవటం లేదు. నరసాపురం వెళ్ళటానికి నడుస్తున్నారు. మీకు నడవటం పని కాదు, నరసాపురం వెళ్ళటం పని. అలాగే మీరు ఏదైతే పొందాలో దానిని పొందటం అనేది మీ పని. మీరు ఒక మాట

మాట్లాడుతున్నారు అనుకోండి, మాట్లాడటమే పని కాదు. నడుస్తుంటే, నడవటమే పని కాదు, కూర్చుంటే కూర్చోవటమే పని కాదు, ఏదైనా వింటుంటే, వినటమే పని కాదు, ఏదైనా రాస్తుంటే, రాయటమే పని కాదు. వీటన్నిటి ద్వారా పొందవలసినది వేరే ఉంది. దానిని మరిచిపోకండి, దానిని మిస్ అవ్వద్దు మీరు. మీరు వంట చేసుకొంటున్నారు, అన్నం తింటున్నారు, లేకపోతే రాసుకొంటున్నారు, ఇంక ఇరవైనాలుగు గంటలు అదే పనా! అది కాదు, అన్నం తినండి, రాసుకోండి, మాట్లాడండి. కాని వీటన్నిటి ద్వారా మీరు పొందవలసిన వస్తువు మరిచిపోకండి. మాట్లాడటం కోసం మాట్లాడకండి, మీరు దేనినైతే పొందుదామని అనుకొంటున్నారో దానికి అనుగుణంగా మాట్లాడండి, దానికి అనుగుణంగా జీవించండి.

నేను అది సాధించాను ఇది సాధించాను, అలా చేసాను, ఇలా చేసాను అని ఎప్పుడూ అనుకోవద్దు. అలా అని ఆత్మ ఏమీ అనుకోదు. నీ అహంకారం అనుకుంటోంది. అలా అనుకునే కొలదీ అహంకారం పెరుగుతుంది. బహు జాగ్రత్తగా జీవించాలి. అశ్రద్ధ పనికిరాదు, అవినయం పనికి రాదు. అనాలోచన, అంటే ఆలోచన లేనితనం పనికి రాదు. మంచి హృదయం ఎంత ముఖ్యమో, మంచి తలకాయ కూడా అంతే ముఖ్యం. అందుచేత నీవు నీవుగా (నేనుగా) ఉండటానికే ప్రయత్నం చెయ్యి, ఆత్మగా ఉండటానికే ప్రయత్నం చెయ్యి.

మనం ఏమి చేస్తున్నాము అంటే, భౌతిక జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు అనుకొంటున్నాము. తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం అనుకొంటున్నాము. అంటే, పూజ గదిలో ఉన్న కాసేపు ఆధ్యాత్మిక జీవితం అనుకొంటున్నాము. పూజ గది గుమ్మం దాటి బయటికి వచ్చిన దగ్గరి నుంచి ప్రాపంచిక జీవితంలో పడిపోతున్నాము. మళ్ళీ పూజ గదిలోకి వెళ్ళేవరకూ ఆధ్యాత్మిక జీవితానికి విడాకులే! ఆధ్యాత్మిక జీవితానికి భౌతిక జీవితానికి విడాకులు ఇవ్వద్దు. మీరు భౌతిక జీవితాన్ని కూడా ఆధ్యాత్మిక జీవితంలో అభివృద్ధిలోకి రావటానికి ఉపయోగించుకోండి. దానికే మీకు టాక్ట్ (tact) అవసరం, తెలివి అవసరం. భగవాన్ ఏమి అన్నారు అంటే నిత్యము కాని దానిని, శాశ్వతము కాని దానిని, శాంతి లేని దానిని మీరు సాధించి ఏమి చేసుకుంటారు!మీ బుద్ధి పాడైపోయిన తరువాత మీ ఇంట్లో ఎన్ని సంపదలు ఉంటే ఏమి లాభం! మనం ఆత్మ స్థితిని పొందాలి, దానికోసం మీ భౌతిక స్థితిని ఉపయోగించుకోండి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 7 నవంబర్ 1995, ఐభీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ధ్యానం చేసేది మనస్సు, ధ్యానం చేసి నశించవలసింది కూడా మనస్సే. అంటే దానిని అది చంపుకుంటుందా మనస్సు? అది సాధ్యపడుతుందా అని అడుగుతున్నారు. ఏక వస్తువును చింతించటమే ధ్యానం. ధ్యానం అంటే ఒకే తలంపుని అంటి పెట్టుకుని ఉండడం. మనకి అనేక తలంపులు వస్తున్నాయి. మనకి అవసరం లేని దానిని అంటే మన స్వరూపం అనుభవంలోకి రావటానికి అడ్డువచ్చే విషయాలను గెంటివేయటం, వాటిని remove చేయటం ధ్యానం. సత్యం మూడు అవస్థల్లోను ఉంది. ఒక అవస్థలో ఉండి ఇంకొక అవస్థలో లేనిది సత్యం కాదు. ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో లేనిది సత్యం కాదు. మూడు అవస్థల్లోను సత్యం ఉంది, ఆత్మ ఉంది. మూడు కాలాల్లోను సత్యం ఉంది. గాఢనిద్రలోను, జాగ్రదావస్థలోను కూడా ఆత్మ ఉంది, సత్యం ఉంది. గాఢనిద్రలో ఆత్మ ఉంది కానీ అక్కడ అశాంతి లేదు, దుఃఖం లేదు, జాగ్రదావస్థలో కూడా ఆత్మ ఉంది, కానీ అక్కడ అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది. అంటే జాగ్రదావస్థలో అశాంతి, దుఃఖం కల్పించబడు తున్నాయి. ఈ అశాంతి, దుఃఖం గాఢనిద్రలో లేవు. ఆత్మ అక్కడ ఉంది, ఇక్కడ ఉంది.

అశాంతి ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు. మనకు అశాంతి వచ్చినా, దుఃఖం వచ్చినా తలంపుల రూపంలో వస్తుంది. అశాంతి నిజం అయితే పోదు. దుఃఖం నిజం అయితే పోదు. అవి ఆత్మ యందు కల్పించబడ్డాయి. కల్పించబడ్డాయి కాబట్టి సాధన చేస్తే పోతాయి. గాఢనిద్రలో లేని అశాంతి, గాఢనిద్రలో లేని దుఃఖం నీకు జాగ్రదావస్థలో వస్తున్నాయి. వాటిని తొలగించడానికి నువ్వు చేసే ప్రయత్నమే సాధన. నువ్వు జపం ద్వారానో, ధ్యానం ద్వారానో వాటిని తొలగించుకోగలిగితే అప్పుడు నీకు వస్తువు అనుభవంలోకి వస్తుంది. ఏక వస్తువుని చింతించడమే ధ్యానం. అది చేసేది మనస్సే. ఒకే తలంపు మీద, ఒకే వస్తువు మీద మనస్సుని నిలబెట్టి ఉంచడమే ధ్యానం. ఏక చింతన ఇతర తలంపుల్ని దూరం

చేస్తుంది. అంటే నువ్వు ఒకే వస్తువుని చింతిస్తుంటే, ఇతర తలంపులు వస్తున్నప్పటికీ, వాటికి నీ మైండ్‌లో నువ్వు ప్లేస్ ఇవ్వడం లేదు కాబట్టి, ఎలా వచ్చాయో అలా వెనక్కి పోతాయి. మీరు ధ్యానం చేసేటప్పుడు కూడా అనేక తలంపులు వస్తూ ఉంటాయి. ధ్యానం అంటే ఒక యుద్ధం లాంటిది. ఏ వస్తువును అయితే ధ్యానిస్తున్నావో, జపిస్తున్నావో, మనస్సు ఆ వస్తువు మీద నిలబడి ఉంటుంది కాబట్టి, ఇతర తలంపులు వచ్చినప్పటికి మనసులో వాటికి ప్లేస్ దొరకదు కాబట్టి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతాయి. అంటే మనసులో నిలబడి ఉండడానికి వాటికి అవకాశం ఉండదు. ఒకే తలంపు మీద మనస్సు నిలబడి ఉంటే ఇతర తలంపులు వచ్చినప్పటికీ వాటికి ఫుడ్ దొరకదు. కాబట్టి అవి వెనక్కి వెళ్ళిపోతూ ఉంటాయి.

ఆవరణదోషం, విక్షేపదోషం, మలదోషం అని మనస్సుకి మూడు దోషాలు చెబుతారు. మలదోషం అంటే మన జన్మాంతరాలలో నుండి మనం పోగు చేసుకుని, తెచ్చుకున్న వాసనలు అన్నీ కూడా మలదోషం. తరువాత విక్షేపదోషం, విక్షేపదోషం అంటే మన శరీరం ఎక్కడ ఉందో మనస్సు అక్కడ ఉండదు. చేతులు ఏ పని చేస్తున్నాయో, మనస్సు అక్కడ ఉండదు. సర్వ సాధారణంగా చాలా మందికి చదువు రాకపోవడానికి కారణం కూడా విక్షేపదోషమే. పుస్తకం దగ్గర కూర్చుంటాడు. మనస్సు పుస్తకం దగ్గర ఉండదు. ఎక్కడికో సినిమాల దగ్గరకి వెళ్ళిపోతూ ఉంటుంది. విక్షేపదోషం ఎవడికి అయితే లేదో వాడికి శరీరం ఉన్నచోటే మనస్సు ఉంటుంది. విక్షేపదోషం ఉంటే మన మనస్సు ఎక్కడ నిలబడమంటే అక్కడ నిలబడదు, చలిస్తూ ఉంటుంది. విక్షేపదోషం లేని వాడికి మనస్సు ఎక్కడ ఉండమంటే అక్కడ ఉంటుంది. విక్షేపదోషం మీకు కనుక ఎక్కువగా ఉంటే, మీ మనస్సు బలంగా లేనట్టు అర్థం. ఎవడికైతే విక్షేపదోషం ఉందో వాడి మైండ్ చాలా వీక్ మైండ్ అని మనం గుర్తు పెట్టుకోవాలి. మూడు ఆవరణదోషం, ఆవరణ అంటే దొడ్డి, దేహానికి సంబంధించిన బంధువులు అని, స్నేహితులు అని వారితో ఒక దొడ్డికింద ఏర్పడి ఆ దొడ్డిలో తిరుగుతూ ఉంటాడు. అంత తప్పించి ఆ మనస్సు ఇక వికసించదు. ఆ దొడ్డి లోనే వాడు జీవితం పొడవునా వంద సంవత్సరాలు బ్రతికినా అందులోనే ఉంటాడు. పల్లెలలో బంధుల దొడ్లు ఉంటాయి. అందులో దూడలని పెడతారు చూడండి, ఎంతసేపు దొడ్లోనే తిరుగుతూ

ఉంటుంది ఆ దూడ, అలాగే ఈ జీవుడు ఏమి చేస్తాడు అంటే ఈ ఆవరణదోషంలో తిరుగుతూ ఉంటాడు. వాడి చుట్టాలని వాడి స్నేహితులో, వాడి సంసారమో అక్కడ నుంచి వాడి మనస్సు బయటకి వెళ్ళదు, ఆ నాలుగు గోడల మధ్యనే తిరుగుతూ ఉంటాడు. ఆవరణ అంటే దొడ్డి, మనస్సుకి ఈ మూడు దోషాలు ఉంటాయి.

మలదోషం, మలదోషం అంటే పూర్వ జన్మల నుంచి వచ్చిన వాసనలని అంటి పెట్టుకుని ఉంటుంది. రెండు విక్షేపదోషం, అంటే ఏ పని అయితే మనం చేస్తున్నామో ఆ పని మీద మనస్సు ఉండదు, ఇక్కడ పని చేస్తూ ఉంటే మనస్సు ఇంకొక చోటుకి పోతూ ఉంటుంది. దీనికే మహాత్మాగాంధీ గారు ఒక మాట చెప్పారు. విక్షేపదోషం వల్ల మనస్సు ఎక్కడికైనా వెళ్ళిపోయినా, మీ మనస్సు వెళ్ళిపోతుంది కదా అని మీ శరీరాన్ని తీసుకుని వెళ్ళి అక్కడ పడేయకండి, మీ శరీరం అక్కడే ఉంచండి, ఒక ఐదు నిముషాలు తిరిగి, తిరిగి మనస్సు మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది అన్నారు. అంటే దాని అర్థం ఏమిటి అంటే మీకు సినిమా చూడాలి అని కోరిక కలిగింది అనుకోండి అప్పటికి, కోరిక కలిగితే కలగనివ్వండి, మీ శరీరాన్ని తీసుకుని వెళ్ళి సినిమా హాలులో పడేయకండి. సినిమా చుట్టూ తిరిగి పది నిమిషాల తరువాత మనస్సు మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది అని దాని అర్థం. విక్షేపదోషం వల్ల మనస్సు తిరుగుతుంది కానీ మీ బాడీని తీసుకుని వెళ్ళి అక్కడ పడేయకండి. మూడు ఆవరణ దోషం అంటే నా స్నేహితులు, నా బంధువులు, నా సంసారం అంటూ ఒక దొడ్డి ఏర్పరచుకొని అందులోనే మనస్సు ఉంటుంది కాని దాని నుండి బయటకు వెళ్ళదు, అదే ఆవరణదోషం. ఈ మూడు దోషాలు మనస్సుకి ఉంటాయి. ఈ మూడు దోషాల నుంచి ఈ జీవుడిని



**భగవంతుని నిరంతరం స్మరిస్తుంటే,**
**భగవదభిముఖంగా కనుక మన ప్రయాణం ఉంటే,**
**నది వెళ్ళి సముద్రంలో కలిసినట్టు మనం కూడా**
**భగవంతుడిలో ఐక్యం అవుతాము.**

విడుదల చెయ్యటమే సాధన యొక్క ప్రయోజనం.

ఏ పని సాధించడానికి అయినా ఒకటి ఓర్పు ఉండాలి, రెండు పట్టుదల ఉండాలి. సహనం లేకపోతే మనం జీవితంలో ఏమి సాధించలేము అది భౌతికమైనది కానీ, అభౌతికమైనది కానీ అందుచేత మనకు సహనం ఉండాలి, పట్టుదల ఉండాలి, తెలివి ఉండాలి, విషయాన్ని గ్రహించే శక్తి ఉండాలి. దానిని ప్రాక్టీస్ చెయ్యాలి. ఏ విషయం అయితే మనం బాగా అవగాహన చేసుకున్నామో, దానినే మనం ప్రాక్టీస్ చేస్తే మనకి అనుభవంలోకి వస్తుంది. ఆధ్యాత్మికం అంటే ఏమీ లేదు, truthని ప్రాక్టీస్ చేస్తే మీ హృదయంలోని truth మీకు వ్యక్తం అవుతుంది అంతే. అంటే ధ్యానం చెయ్యగా, చెయ్యగా మనస్సు బలపడుతుంది. మీ మనస్సుకి ఏకాగ్రత వస్తుంది, మీ మనస్సుకి పవిత్రత వస్తుంది. మీ మనస్సుకి ప్రవీణత వస్తుంది. ధ్యానం యొక్క ప్రయోజనం అది. మనం భగవంతుడిని ధ్యానం చెయ్యకపోతే, భగవంతుడికి నష్టం ఏమీ లేదు. మన మైండ్ యొక్క purification కోసమే మనం చెయ్యాలి. మనం చేసే పనులు అన్నీ మన ఉద్ధరణ కోసమే. మనం దేవుడి నామాన్ని స్మరించకపోతే దేవుడికి నష్టం ఏమీ లేదు. మనం బాగు పడటం కోసమే మనం దేవుడి నామాన్ని స్మరించాలి.

స్వామి వివేకానంద ఒక మాట అనేవారు. జ్ఞానం అనే పెట్టి నీ హృదయంలోనే ఉంది. కానీ ఆ పెట్టెని ఓపెన్ చేసుకోవడానికి నీ దగ్గర తాళం చెవి లేదు. ఆ తాళం చెవి సంపాదించాలి అంటే నువ్వు ధ్యానం చెయ్యాలి. ధ్యానం చెయ్యడం వల్ల ఏకాగ్రత అనే తాళం చెవి వస్తుంది. పెట్టె నీ దగ్గరే ఉంది కాబట్టి తాళం చెవి నువ్వు సంపాదిస్తే అది ఓపెన్ చేసుకోవచ్చు. నీ హృదయంలోనే జ్ఞానం ఉంది, అందుచేత ఏకాగ్రత అనే తాళం చెవి నువ్వు సంపాదించాలి. జీవితంలో ఏది సాధించాలి అన్నా మనిషికి ఏకాగ్రత ఉండాలి. ఏకాగ్రత లేకపోతే మనిషి ఏది సాధించలేడు. రోడ్డు మీద పోయే ఒక సామాన్య మానవుడికి, Greatest scientistకి, greatest saintకి తేడా ఏమిటి అంటే, వాడికున్న ఏకాగ్రత వీడికి లేదు. వాడికున్న ఏకాగ్రత వీడికి ఉంటే వీడు saint అవుతాడు, వీడు scientist అవుతాడు. ఏకాగ్రత ముఖ్యం. ఆ ఏకాగ్రత ధ్యానం వల్ల వస్తుంది. అందుకు ధ్యానం చెయ్యాలి. కొంతమందికి

వాక్కు చాపల్యం ఉంటుంది. వాక్కు చాపల్యం తగ్గాలి అంటే కొంచెం మౌనాన్ని ప్రాక్టీస్ చెయ్యాలి. అలాగే మనస్సులో చాపల్యం ఉంటుంది, ఆ మనస్సులో చాపల్యం తగ్గాలి అంటే ధ్యానం చెయ్యాలి. ధ్యానం చెయ్యగా, చెయ్యగా, మనస్సు యొక్క wondering తగ్గుతుంది. అంటే దానికున్న చాపల్యం తగ్గుతుంది.

నువ్వు ధ్యానం చెయ్యగా, చెయ్యగా, చెయ్యగా, అప్పుడు నీకు చాపల్యం పోతుంది, చపలచిత్తం పోతుంది, అప్పుడు నీకు సద్భావ స్థితి కలుగుతుంది, ఏకాగ్రత కలుగుతుంది, Purity కూడా కలుగుతుంది. బ్రహ్మానుభవం పొందడానికి నీకు అర్హతని, యోగ్యతని కలుగజేసేది నీ ధ్యాన బలం. జ్ఞానం నీ హృదయంలో ఉంది దానికి సంబంధించిన అనుభవం నీకు లేదు. ఆ అనుభవం నీ చేతికి అందాలి అంటే నీకు యోగ్యత ఉండాలి. అర్హత ఉండాలి. వస్తువు దగ్గర ఉన్నప్పటికీ, నీకు యోగ్యత లేకపోతే, అర్హత లేకపోతే కళ్లు ఉండి చూడలేవు. చెవులు ఉండి వినలేవు. నీ ధ్యాన బలం, నీ హృదయంలో ఉన్న వస్తువుని నీకు అనుభవంలోకి తీసుకు రావడానికి నీకు సహాయం చేస్తుంది. మనస్సు యొక్క చాపల్యం పోతుంది. దానికి ఏకాగ్రత కలుగుతుంది. ఏకాగ్రం అయిన మనస్సు, సున్నితం అయిన మనస్సు, సూక్ష్మం అయిన బుద్ధి, అంతర్ముఖం అవుతుంది. స్థూలబుద్ధి అంతర్ముఖం కాదు. సూక్ష్మబుద్ధి అంతర్ముఖం అవుతుంది. అంతర్ముఖం అయిన మనస్సుకి ఆత్మ వైపుకి దారి ఏమిటో తెలుస్తుంది. బాహ్యముఖం అయిన మనస్సుకి ఆత్మను చేరుకోవటానికి దారే కనపడదు. తరువాత నువ్వు ఎంత దూరం నడుస్తావు అనేది వేరే విషయం. బాహ్యముఖంలో ఉన్నవాడికి దారే కనపడదు, అంతర్ముఖం అయిన మనస్సుకే ఆత్మని వెతకడానికి తగిన యోగ్యత కలుగుతుంది. ధ్యానం కూడా మనస్సుని అంతర్ముఖం చేస్తుంది. నీ మనస్సుకి ఉదాత్త స్థితి కలుగుతుంది. ఉన్నత స్థితి కలుగుతుంది. ఏది నిజం, ఏది అనిజం? ఏది సత్యం, ఏది అసత్యం? అనే వివేకం నీకు కలుగుతుంది. ధ్యానబలం వలన సహృదయం నీకు కలుగుతుంది. ఎప్పుడైతే మనస్సు యొక్క చాపల్యం పోయిందో, అప్పుడు నువ్వు జ్ఞానానుభవం పొందడానికి తాళం చెవి సంపాదించుకున్నట్టు అవుతుంది. నీకు సద్భావస్థితి ఏర్పడుతుంది. నీ పూర్వ జన్మ ప్రవృత్తిని బట్టి, నువ్వు సాధన చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం

చెయ్యి. లేకపోతే ఆ వస్తువు కోసం అన్వేషణ చెయ్యి, ఆ truth కోసం search చెయ్యి. నీ పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి నీ పద్ధతిలో నువ్వు సాధన చేసుకో. అలా సాధన చెయ్యగా, చెయ్యగా నీ మనస్సు శుద్ధి అవుతుంది. నీ మనస్సు purify అవుతుంది. ఎప్పుడైతే నీ మనస్సు బాగా శుద్ధం అయ్యిందో, అందులో ఉన్న దోషాలు ఎప్పుడైతే రాలిపోయాయో, అందులో బలహీనతలు ఎప్పుడైతే రాలిపోయాయో, మనస్సుకి ఎప్పుడైతే చాపల్యం తగ్గిపోయిందో, ఆ శుద్ధమైన మనస్సే ఆత్మగా పరిణామం చెందుతుంది.

మీరు చేసే సాధన యొక్క ప్రయోజనం మీ మనస్సుని purify చేసుకోవడమే. ధ్యానం యొక్క ప్రయోజనం కూడా అంతే అని చెబుతున్నారు. అందుచేత భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే, natural స్టేట్‌కి మనం రావాలి. Normal స్టేట్‌కి మనం రావాలి. Artificial స్టేట్‌లో మనం ఉండకూడదు. మనం అందరం నేను మనిషిని, నేను మనిషిని అనుకుంటున్నాం. స్త్రీ నేను స్త్రీని, నేను స్త్రీని అనుకుంటుంది. పురుషుడు నేను పురుషుడిని, నేను పురుషుడిని అనుకుంటాడు. నేను మనిషిని అనుకోవటం నార్మల్ స్టేట్ కాదు, అది natural స్టేట్ కాదు. నేను ఉన్నాను అనుకోవటం నార్మల్ స్టేట్. ఏది Normal స్టేట్ అంటే వాడు సహజంగా నేను ఉన్నాను అనుకుంటాడు అంతే గాని నేను పురుషుడిని అనుకోడు, నేను స్త్రీని అనుకోడు, నేను తక్కువ వాడిని అనుకోడు, నేను గొప్పవాడిని అనుకోడు. వాడికి superiority complex ఉండదు, inferiority complex ఉండదు. వాడికి ఏమి comparison ఉండదు. comparison చేసుకోవడానికి ద్వితీయం వాడికి ఉండదు, నేను ఉన్నాను అనుకుంటాడు. నేను స్త్రీని అనుకుంటే వారు బాడీ తోటి identify అవుతున్నారు. నేను పురుషుడిని అనుకుంటే వాడు బాడీ తోటి identify అవుతున్నాడు. నేను డాక్టరుని అనుకుంటే వాడు వృత్తి తోటి identify అవుతున్నాడు. వృత్తి తోటి కానీ, దేహం తోటి కాని, sex తోటి కాని, మీకు identification ఉన్నంతకాలం నువ్వు normalగా లేవు, naturalగా లేవు. నేను ఉన్నాను అనేదే Normal స్టేట్, అది natural స్టేట్, నేను స్త్రీని, నేను పురుషుడిని అనుకుంటే నువ్వు దేహంతో identify అవుతున్నావు కాబట్టి నువ్వు natural stateలో లేవు. Normal stateలో లేవు అని భగవాన్ చెబుతున్నారు.

నీ నిజమైన స్వభావం శాంతే, శాంతి ఎక్కడో లేదు. నీ స్వభావంలోనే ఉంది, నీ స్వరూపంలోనే ఉంది కానీ నీకు ఎందుకు అందడం లేదు? మనం రూపాల గొడవలలో ఉన్నాం. జన్మ జన్మల నుంచి ఈ రూపదృష్టిలో పాతుకు పోయాం. మన మనస్సు ఎప్పుడూ ఏదో ఒక రూపాన్ని పట్టుకుని తిరుగుతూ ఉంటుంది. మన స్వరూపం అరూపం. అందులో శాంతి ఉంది, అందులో సుఖం ఉంది, అందులో ఆనందం ఉంది. కానీ మన చేతికి దొరకడం లేదు. మన చేతికి దొరకక పోవడానికి కారణం మన ఈ రూపదృష్టికి అలవాటు పడిపోయాం. ఒక రూపాన్ని పట్టుకుని పుట్టాం, ఒక రూపాన్ని పట్టుకుని పెరుగుతున్నాం. రూపాలు మారుస్తూ ఉంటాం. చనిపోయేటప్పుడు కూడా ఏదో ఒక రూపాన్ని భావన చేస్తూ చనిపోతాం. పుట్టటం రూపం తోటి పుట్టావు, చనిపోయేటప్పుడు ఏదో ఒక రూపాన్ని తలపెట్టుకుంటూ చస్తున్నావు. రూపాలను మారుస్తున్నావు. నువ్వు ఆ రూపాలని, ఈ రూపాలని వేసుకుని తిరుగుతున్నావు జీవితం పొడవునా రూపదృష్టిలో స్థిరపడిపోయావు. లోపల ఉన్న సత్యవస్తువు అరూపం, నువ్వు ఎన్నాళ్ళు చూసినా నీ మనస్సు ఏదో ఒక రూపాన్ని పట్టుకుని వేలాడుతుంది. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు దొరకక పోవడానికి నీ రూపదృష్టి, నీ నామదృష్టి కారణం. నీ దేహానికి పరిమితం అయిన బుద్ధి, నీ పేరుకి పరిమితం అయిన బుద్ధిని నశింప చేసుకోవడానికి నీకు వివేకం కావాలి, వైరాగ్యం కావాలి, జ్ఞానం కావాలి, వికాసం కావాలి అని భగవాన్ చెబుతున్నారు ఇక్కడ. మన మనస్సుని purify చెయ్యాలి, అది చాలా ముఖ్యం. మాటల్లో జాగ్రత్తగా ఉండాలి, నీ చేతల్లో జాగ్రత్తగా ఉండాలి. మనస్సు, మాట, చేత మూడు వంకరగా ఉండకూడదు. మూడు ఏకంగా ఉండాలి,

**ఆధ్యాత్మిక మార్గంలో కానీ, భౌతిక జీవితంలో కానీ, అభివృద్ధిలోకి రావాలి అంటే రెండు ముఖ్యం - ఒకటి ఆత్మవిశ్వాసం, రెండు క్రమశిక్షణ.**



నిదానంగా ఉండాలి, నిర్మలంగా ఉండాలి. అప్పుడు నీ మనస్సు యొక్క purificationకి నీ మాట సహకరిస్తుంది. నీ చేత సహకరిస్తుంది. నీ మనస్సు కూడా సహకరిస్తుంది.

శివుడు లయ కారకుడు అంటున్నారు కదా, లయ కారకుడు అయిన శివుడిని మమ్మల్ని ధ్యానం చెయ్యమంటారా అని అడుగుతున్నాడు. లయ కారకుడు అంటే శివుడు నిన్ను ఏమి పాడు చెయ్యడు. లయ కారకుడు అంటే నీ దుఃఖాన్ని లయం చేస్తాడు. నీ దుఃఖాన్ని నాశనం చేస్తాడు. అందుచేత శివుడిని కూడా నువ్వు ధ్యానం చెయ్యచ్చు. శివుడు నీ దుఃఖాన్ని లయం చేస్తాడు, సుఖ స్వరూపం అనుభవంలోకి రావడానికి ఏ విషయాలు అయితే, ఏ ఇంద్రియ సుఖాలు అయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని లయం చేస్తాడు. వాటిని eliminate చేస్తాడు, వాటిని destroy చేస్తాడు, వాటిని burn చేస్తాడు. అందుచేత నువ్వు శివుడిని కూడా ధ్యానం చెయ్యచ్చు. లయ కారకుడు అంటే నువ్వు చెడ్డగా అర్థం చేసుకోకు. నీ దుఃఖాన్ని లయం చేస్తాడు, నీ అశాంతిని లయం చేస్తాడు. నీ మానసికమైన అనారోగ్యాన్ని లయం చేస్తాడు. అంటే నువ్వు శివుడిని కూడా ధ్యానం చేసుకోవచ్చు. నీ ఆలోచనలు, నీ అనుమానాలు, నీ ప్రశ్నలు, నీ డౌట్స్ ఇవన్నీ కూడా మనసు create చేస్తుంది. నీ బంధానికి కారణం ఎవరు? మనస్సే. నాకు మోక్షం కావాలి అని అడిగేది ఎవరు? మనస్సే. మనస్సు నశిస్తే నీకు ఉన్న వస్తువు వ్యక్తం అవుతుంది. దానికి బంధం లేదు, దానికి మోక్షం లేదు. మీకు అర్థం అవుతోందా? ఆత్మకి బంధం లేదు. ఆత్మకి మోక్షం లేదు. ఈ బంధం గొడవ, ఈ మోక్షం గొడవ ఎవరికి? మనస్సుకే. చైతన్యంలో బంధం లేదు, చైతన్యంలో మోక్షం లేదు, చైతన్యంలో అశాంతి లేదు, చైతన్యానికి పుట్టుక లేదు, చైతన్యానికి చావు లేదు, చైతన్యానికి ముసలితనం లేదు. మనం చెప్పకునే గొడవలకి, మన మనస్సులో వచ్చే ఊహలకి, మన మాటలకి ఆ చైతన్యం అతీతం.

నిజమైన గురువు ఎవరు అంటే వాడు చైతన్యస్వరూపుడు, వాడికి మాటల తోటి పని లేదు, వాడు మౌనంగా ఉంటే ఆ మౌనం లోంచి వచ్చే శాంతి తరంగాలు, ఆ మౌనం లోంచి వచ్చే కాంతి తరంగాలు, శిష్యుడి యొక్క మనస్సుని శుద్ధం చేసి ఆత్మాకారం చెందింప చేస్తాయి వాడే సద్గురువు. సద్గురువుకి మాటల తోటి పని లేదు. ఉపన్యాసాల తోటి పనిలేదు,

రాతల తోటి పని లేదు. వాడు మౌనంగా ఉంటాడు, ఆ మౌనం మహాశక్తివంతమైనది. ఆ మౌనం లోంచి పుట్టే కాంతి ప్రవాహం, శాంతి ప్రవాహం, ఆనంద ప్రవాహం వచ్చి ఈ శిష్యుడి యొక్క మనస్సుని, ధ్యాన స్థితికి తీసుకుని పోయి, వాడి ప్రయత్నం అక్కర్లేకుండా వాడి మనస్సుని శుద్ధి చేసి, వాడి మనస్సుని అంతర్ముఖం చేస్తాడు. నిజమైన గురువు ఆత్మ రూపంలోనే ఉన్నాడు కాబట్టి, ఆత్మానుభవం వాడికి కలుగజేసే వరకు గురువు శిష్యుడిని విడిచి పెట్టడు. ఇదంతా మౌనంగానే జరిగిపోతూ ఉంటుంది. మాట కంటే మౌనానికి శక్తి ఉందన్న సంగతి ఇంకా మనకి గ్రహింపు రాలేదు. మాటకంటే మౌనానికి శక్తి ఉంది. ఆత్మ లోంచి తలంపు వస్తుంది, తలంపు లోంచి మాట వస్తుంది. మనకు మనో మౌనం కావాలి, వాక్కు మౌనం కాదు.

మనస్సు ఎప్పుడైతే అణిగిపోయిందో అదే నిజమైన నమస్కారం అన్నారు భగవాన్. నమస్కారం అంటే చేతులు జోడించటం కాదు. భగవంతుడు మీ నమస్కారాలకి మోసపోడు. మీ మాటలకి మోసపోడు. మీకు అహంభావం ఎంత ఉందో అది చూస్తూ ఉంటాడు. దాన్ని బట్టి మీకు మార్కులు వేస్తాడు. అంతేకాని మీ మాటలకి, లేకపోతే మీ ఊహలకి, లేకపోతే మీ నమస్కారాలకి, మీ కూర్చోవటాలకి, మీ నుంచోవటాలకి మోసపోయేటంత అమాయకుడు కాదు ఈశ్వరుడు. ఆయన చూసేది ఒక్కటే, నీలో ఎంతవరకు అహంభావన ఉందో అదే చూస్తూ ఉంటాడు. నమస్కారం అంటే మనసు అణిగి ఉండటమే నిజమైన నమస్కారం.

భగవాన్ అంటున్నారు నువ్వు ఇప్పుడు జాగ్రదావస్థలో ఉన్నావు, కొంతసేపటికి నిద్రపోతావు. తెల్లవారుజామున లేవగానే నేను సుఖంగా నిద్రపోయాను అంటావు. రాత్రి వాడికి కలలు ఏమీ లేవు అనుకోండి వాడు మెలకువలోకి వచ్చాక ఏమంటాడు అంటే, రాత్రి చక్కగా నిద్రపోయాను, సుఖంగా నిద్ర పట్టింది అని అంటాడు. నిద్రలో సహజంగా ఎందుకు ఉన్నావు అంటే, నిద్రలో నిర్మలంగా ఎందుకు ఉన్నావు అంటే, నీ మనస్సు గొడవ అక్కడ లేదు, ఈ మనస్సు కల్పించిన పెంట అక్కడ లేదు. ఈ అహంభావన అనే పెంట అక్కడ లేదు. ఎక్కడైతే కల్పించుకున్నది లేదో, అక్కడ నువ్వు సహజంగా ఉన్నావు, Normalగా

ఉన్నావు, నువ్వు నిద్రలో Normalగానే ఉన్నావు. ఎందుచేత? నువ్వు కల్పించుకున్న గొడవలు అక్కడ లేవు. నీ మనస్సు యొక్క fiction అక్కడ లేదు. ఏదైతే కల్పించుకుంటుందో నీ మనస్సు అది గాఢనిద్రలో లేదు కాబట్టి, అక్కడ నువ్వు చక్కగా ఉంటున్నావు. జాగ్రదావస్థలో మనం సుఖంగా లేము, ఏదో ఒక గొడవల తోటి బాధపడుతున్నాము.

రమణమహర్షి గారు ఒక సందర్భంలో ఒక మాట చెప్పారు. జాగ్రదావస్థలోకంటే, స్వప్నావస్థలో కంటే గాఢనిద్రలోనే నువ్వు సత్యానికి దగ్గరగా ఉన్నావు అని. ఎందుచేత అంటే అక్కడ నువ్వు కల్పించుకున్న గొడవలు ఏమీ లేవు. నీ దుఃఖం అక్కడ లేదు. అధికారం గొడవ లేదు. అంటే నీ మనస్సు ఏదైతే కల్పించిందో ఆ కల్పించిన గొడవలు అక్కడ లేవు. అందుచేత సహజంగా ఉండగలుగుతున్నావు. Truth కి దగ్గరగా ఉంటున్నావు కాబట్టి నువ్వు గాఢనిద్రలో చక్కగా ఉండగలుగుతున్నావు. ఆ గాఢనిద్రలో ఏ ఆత్మ అయితే ఉందో, ఆ ఆత్మ ఇప్పుడు లేదు అనుకోకు, ఇప్పుడు కూడా ఉంది. గాఢనిద్రలో ఆత్మ ఉండి, జాగ్రదావస్థలో కనుక లేకపోతే అది నిజం కాదు. ఒక అవస్థలో ఉండి, ఇంకొక అవస్థలో లేకపోతే అది నిజం కాదు. ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో లేకపోతే అది నిజం కాదు. ఈ దేహం కొంతకాలం కిందట లేదు, మళ్ళీ కొంతకాలం తరువాత ఉండదు. మధ్యలో కొంతకాలం ఈ దేహం అటు ఇటు తిరుగుతుంది. అహంభావం ఉన్నంతకాలం మళ్ళీ మనం శరీరం ధరించాలి. ఈ శరీరం ముసలిది అయిపోయినప్పటికి, ఈ శరీరం మరణించినప్పటికీ, అహంభావన ఉన్నంతకాలం మళ్ళీ మనం కొత్త దేహాన్ని తొడుక్కోవాలి, ఎందుచేత అంటే అహంభావన దేహం లేకుండా ఉండలేదు. ఆత్మ దేహం లేకుండా ఉండగలదు, ప్రపంచం లేకుండా ఉండగలదు, దేవుడు లేకుండా ఉండగలదు. కాని అహంభావన దేహం లేకుండా ఉండలేదు, ప్రపంచం లేకుండా ఉండలేదు. అందుచేత అహంభావం ఉన్నంతకాలం దేహం వస్తుంది, దేహం వస్తే ప్రపంచం వస్తుంది, ప్రపంచం వస్తే దేవుడు గొడవ వస్తుంది. అందుచేత రమణమహర్షి గారు అనేవారు అహంకారానికి ఈ దేహం సరిపోలేదు, ఈ ప్రపంచం సరిపోలేదు, దీని అందానికి ఒక దేవుడు కూడా కావలసి వచ్చాడు అనేవారు. దేని అందానికి? ఈ అహంకారం యొక్క అందానికి దేవుడు కూడా కావలసి వచ్చాడు.

అహంకారం ఎప్పుడైతే నశించిందో, అహంకారం కల్పించినవి కూడా నశించి పోతాయి. మీ గాఢనిద్రలో ఉన్న స్థితే నిజమైన స్థితి. గాఢనిద్రలో నువ్వు సుఖంగా ఉన్నావు. కానీ నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలియటం లేదు. జాగ్రదావస్థలో నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది. కానీ అక్కడే సుఖంగా లేవు. ఇప్పుడు నీకు కావాల్సింది ఏమిటి అంటే, గాఢనిద్రలో ఉన్న సుఖం, జాగ్రదావస్థలో ఉన్న ఎరుక కావాలి. ఇవి రెండు సంపాదిస్తే నువ్వు మహా జ్ఞానివి అయిపోతావు. నిద్రావస్థలో ఉన్న సుఖం, జాగ్రదావస్థలో ఉన్న ఎరుక ఇవి రెండు ఒకేసారి మన అనుభవంలోకి ఎప్పుడైతే వచ్చాయో, అప్పుడు నువ్వు మహాజ్ఞానివి అయిపోతావు, ప్రకృతి నిన్ను విడిచి పెట్టేస్తుంది, మాయ నీకు దారి ఇచ్చేస్తుంది, అప్పుడు భగవంతుడు నీకు వేరుగా ఉండడు. నీకు నేనుగానే అంటే నీ స్వరూపంగానే వ్యక్తం అవుతాడు. మన జీవితం యొక్క గమ్యం అదే. దేహాన్ని ప్రారబ్దానికి విడిచి పెట్టేయ్, నువ్వు వచ్చిన పని ఏదో నువ్వు చూసుకో అన్నారు భగవాన్. ప్రారబ్ధం ప్రకారం దేహయాత్ర నడిచిపోతుంది. దేహయాత్ర నీ సంకల్పం మీద, నీ కోరికల మీద, నీ తెలివితేటల మీద ఆధారపడి లేదు. అది రావలసి ఉంటే నీకు కష్టం వచ్చినా, నీకు సుఖం వచ్చినా, ప్రారబ్ధాన్ని బట్టి అది వచ్చేస్తుంది. ఏ అనుభవం పొందడానికి నీ దేహం వచ్చిందో, ఆ అనుభవం పొందిన తరువాత దేహం పడిపోతుంది. అందుచేత దేహాన్ని నువ్వు ప్రారబ్దానికి విడిచి పెట్టు. విచారణ చేసుకుని నువ్వు ఎవరవో నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. అది ఇక్కడ భగవాన్ సందేశం.

నిద్రలో ఏ స్థితిలో ఉన్నావో, ఆ స్థితి జాగ్రదావస్థలోకి తెచ్చుకోవడానికి నువ్వు ప్రయత్నం



**భగవంతుడిని మనం ప్రత్యేకంగా ఇది కావాలి అని అడగకూడదు. ఒకోసారి మనం అడిగినవే మనకు తంటాలు తెచ్చి పెడతాయి. ఉదాసీనంగా ఉండటం మంచిది. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికే బాగా తెలుసు.**

చెయ్యి. అప్పుడు నువ్వు జీవుడుగా ఉండవు, అప్పుడు నువ్వు శివుడు అయిపోతావు. భగవాన్ ఎంత సరళంగా చెబుతున్నారో చూడండి. ఇప్పుడు నువ్వు జీవుడు, జీవుడు అనుకుంటున్నావు. నిద్రావస్థని జాగ్రదావస్థలోకి నువ్వు ఎప్పడైతే తెచ్చుకున్నావో, నిద్రావస్థ ఎప్పడైతే నీకు మెలకువలో ఉండగా అనుభవంలోకి వచ్చిందో, అప్పుడు నువ్వు జీవుడిగా ఉండవు, దేవుడివి అయిపోతావు. శివుడివి అయిపోతావు. ఎప్పడైతే నువ్వు శివుడివి అయిపోయావో, శివుడు అంతటా ఉన్నాడు కాబట్టి నేను అంతటా ఉన్నాను, నేను లేని చోటు అంటూ లేదనే అనుభవం నీకు వస్తుంది. ఇప్పుడు నువ్వు దేహం ఎక్కడ ఉంటే అక్కడే ఉన్నాను అనుకుంటున్నావు. ఎందుచేత అంటే నీకు దేహం మాత్రమే అనుభవంలో ఉంది. ఎప్పడైతే ఆత్మ అనుభవంలో వచ్చిందో ఆత్మ అంతటా ఉంది కాబట్టి, నేను అంతటా ఉన్నాను అనే అనుభవం నీకు వచ్చేస్తుంది. నువ్వు సోమరితనంగా ఉండకు, ఎంతో కొంత ప్రయత్నం చెయ్యి. ప్రయత్నం చేస్తే ఈశ్వరుడు నిన్ను అనుగ్రహిస్తాడు. ఆయన అనుగ్రహం లేకుండా ఆయన స్వరూపాన్ని పొందలేము. అందుచేత ఆయన అనుగ్రహం పొందడం కోసం, ఎటువంటి పని చేస్తే ఆయనకి సంతోషం కలుగుతుందో అటువంటి పని చెయ్యడానికి నీ జీవితం పొడవునా ప్రయత్నం చెయ్యి. అంటే భగవంతుడిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడే పనే నువ్వు చేస్తూ ఉండు. నువ్వు చేసే పని నిన్ను బంధించేటట్టు ఉండకూడదు. అజ్ఞానం లోంచి విడుదల పొందడానికి నువ్వు చేసే పని నీకు సహకరించాలి. అందరం పని చేస్తున్నాం కానీ ఆ చేసే పని ఎలా చెయ్యాలో నేర్చుకుంటే, బ్రహ్మానుభవం కలుగుతుంది అంటున్నారు రమణస్వామి.

కొంతమంది దేవుడికి రూపం ఉందా అని అడుగుతూ ఉంటారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అసలు నీకు రూపం ఉందా? నీకే రూపం లేదు. నీకే రూపం లేనప్పుడు దేవుడికి రూపం ఎక్కడ ఉంటుంది? దేవుడికి రూపం లేదు, దేవుడికి పేరు లేదు, ఆ రూపాలు, పేర్లు మనం కల్పించుకున్నాం. మీకు అర్థం అవుతోందా? మనకి ఎంతసేపు రూపదృష్టి, నామదృష్టి. రూపదృష్టిని దాటి, నామదృష్టిని దాటి మనం బయటకి వెళ్ళలేక పోతున్నాం. మనకి రూపదృష్టి ఉంది కాబట్టి దేవుడికి ఒక రూపం కల్పించాం. మనకి పేర్లు

అంటే ఇష్టం కాబట్టి దేవుడికి కూడా ఒక పేరు కల్పించాం. (అసలు దేవుడికి రూపం ఉందా, లేదా అని నువ్వు అడుగుతున్నావు. అసలు నీకే రూపం లేదు, నీకే రూపం లేనప్పుడు ఇంక దేవుడికి రూపం ఎక్కడ ఉంటుంది?) మీరు అందరూ రాత్రి నిద్రపోతున్నారు. నిద్రలో నేను స్త్రీని, నేను పురుషుడిని, నేను ఎల్లమ్మని, నేను నల్లగా ఉన్నాను, నేను తెల్లగా ఉన్నాను అని ఏదైనా ఒక రూపం తోటి నువ్వు తాదాత్మ్యం పొందుతున్నావా అని అడుగుతున్నారు భగవాన్. నిద్రలో నీకు శరీరం తోటి ఏమి సంబంధం లేదు. నిద్రలో ఉన్నవాడు bodyless, నిద్రలో ఉన్న వాడు godless, నిద్రలో ఉన్నవాడు worldless. వాడికి దేహం గొడవ లేదు. దేవుడి గొడవ లేదు. లోకం గొడవ లేదు. ఇవేమీ లేకుండా వాడు మటుకు ఉన్నాడు. గాఢనిద్రలో నేను లేను అని ఎవడైనా చెబుతున్నాడా? లేనని చెప్పటం లేదు, ఉన్నాను అనే చెబుతున్నాడు. పైగా సుఖంగా ఉన్నాను అని చెబుతున్నాడు. నువ్వు నిద్రపోతున్నప్పటికీ నీ హృదయంలో నిద్రపోకుండా చూసేవాడు ఒకడు ఉన్నాడు. మీకు అర్థం అవుతోందా? వాడే దేవుడు, వాడే చైతన్యం, నిద్రలో ఏ వస్తువు అయితే ఉందో ఆ వస్తువు ఇప్పుడు కూడా ఉంది. అది నిన్ను విడిచి పెట్టి ఎక్కడకి పారిపోలేదు. నిద్రలో ఏ నేను అయితే ఉందో ఇప్పుడు కూడా ఆ నేను ఉంది.

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే నిద్రలో ఏ నేను అయితే ఉందో ఆ నేనుని ఇప్పుడు నువ్వు పట్టుకో జ్ఞానివి అయిపోతావు అంటున్నారు. పట్టుకోవాల్సిన దానిని పట్టుకో, విడిచి పెట్టవలసిన దానిని విడిచి పెట్టు. అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. నిద్రలో మానవుడు ఏదైతే కాదో దాంట్లోంచి వాడు సెపరేట్ అవుతున్నాడు. గాఢనిద్రలో నీ బంధువుల తోటి, నీ స్నేహితుల తోటి, నీ దేహం తోటి, నీ మనస్సు తోటి, నీ struggles తోటి, నీ disappointments తోటి, నీ tensions తోటి, వీటన్నిటితోటి నువ్వు సెపరేట్ అయిపోతున్నావు. ఎందుచేత? ఇవన్నీ నువ్వు కాదు కాబట్టి. మనం ఏదైతే కాదో దాంట్లోంచి విడిపోతున్నాం గాఢనిద్రలో, ఇది బాగా గుర్తు పెట్టుకోండి. గాఢనిద్రలో ఉన్న సుఖాన్ని, శాంతిని జాగ్రదావస్థలోకి వచ్చేటప్పటికి చెదర గొట్టేస్తుంది. ఎవరు చెదరగొట్టేస్తున్నారు? మనస్సు. తలంపులు, వాసనలు, కోరికలు, భయాలు ఇవి అన్నీ ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. మనసు రాగానే ఇవన్నీ

కూడా వచ్చేస్తున్నాయి. నీకు అశాంతి ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. నీ భయం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. జాగ్రదావస్థలోకి మనసు వచ్చినప్పుడు ఇవన్నీ కూడా వచ్చేస్తున్నాయి. అందుచేత మనస్సు అణగాలి, మనస్సు అణిగితే మనస్సులో ఉన్న భయం కూడా అణిగిపోతుంది. భయం ఎక్కడ ఉంది? చైతన్యంలో లేదు. దేహంలో లేదు. మనస్సులో ఉంది. మనస్సు అణిగినప్పుడు భయం కూడా అణిగిపోతుంది. గాఢనిద్రలో ఎలా ఉన్నావో, జాగ్రదావస్థలో కూడా అలా ఉండడానికి నువ్వు ప్రయత్నం చేస్తే, నీ యదార్థ స్వరూపం వ్యక్తం అవుతుంది.

గాఢనిద్రలో నువ్వు ఉన్నావు. ఎలా ఉన్నావు? దేహంగా లేవు, మనస్సుగా లేవు, దేవుడిగా లేవు, లోకంగా లేవు మరి ఎలా ఉన్నావు? ఆత్మగా ఉన్నావు, చైతన్యంగా ఉన్నావు. ఎక్కడ? గాఢనిద్రలో, కానీ చిన్న గొడవ ఎక్కడ వచ్చింది అంటే, నువ్వు గాఢనిద్రలో చైతన్యంగా ఉన్నా, ఆత్మగా ఉన్నా, నువ్వు ఉన్నావు అన్న సంగతి నీకు తెలియటం లేదు. జాగ్రదావస్థలో నీ దేహం తోటి నువ్వు తాదాత్మ్యం పొందుతున్నావు. ఈ శవాన్ని కూడా వేసుకుని తిరుగుతున్నాము మనం అందరం. మనకి పొలాలు ఏమీ లేకపోయినా, బ్యాంకు అకౌంటులు లేకపోయినా అందరికీ తలొక శవం ఉంది కదా, అహంభావన ఉంది, దేవుడు లేడు అని చెప్పేవాళ్ళు చాలామంది ఉన్నారు కానీ నేను లేనని ఎవరు చెప్పరు ఎందుచేత? వాడికి నేను వ్యక్తం అవుతుంది కాబట్టి, దేవుడు వాడికి వ్యక్తం కావటం లేదు కాబట్టి లేడు అనుకుంటున్నాడు. నేను లేనని చెప్పేవాడు ఎవడు లేడు.

రమణమహర్షి గారు ఏమంటున్నారు అంటే దేవుడి గొడవ వదిలెయ్యి, దేవుడు ఉన్నాడో, లేడో, ఆ దేవుడు గొడవ నీకు ఎందుకు? దేవుడు ఉన్నాడు అని చెప్పచ్చు, లేడని చెప్పచ్చు, నేను ఉన్నాను అని నువ్వు చెబుతున్నావు కదా, నేను ఉన్నాను అన్న సంగతి నీకు అనుమానం లేదు కదా, ఆ నేను ఎవరో నీకు తెలిస్తే, ఆ నేనుని నువ్వు తెలుసుకుంటే దేవుడు కూడా తెలుస్తాడు. ఈ నేను ఎవడో నీకు తెలియకపోతే దేవుడు కూడా తెలియడు. ఈ నేను మొదట్లోనే, ఈ నేను అనే తలంపు ఏ హృదయం లోంచి అయితే జన్మించి వస్తుందో, ఈ నేను అనే తలంపు ఎక్కడ నుంచి అయితే పుట్టి వస్తుందో అక్కడే దేవుడు

ఉన్నాడు. అందుచేత నేను యొక్క మూలం తెలియకపోతే నీకు దేవుడు కూడా తెలియడు. ఈ నేను అనే తలంపు యొక్క సోర్స్ నీకు తెలియకుండా నేను దేవుడిని చూశాను అంటే అది నిజం కాదు. అది కేవలం మానసిక దృశ్యమే. మన అందరికీ ఎప్పుడూ మన హృదయంలో ఉండే దేవుడు అంటే మనకి ఇష్టం ఉండదు. ఒక ఐదు నిమిషాలు కనిపించి వెళ్ళిపోయాడు అనుకోండి దేవుడు, ఆ దేవుడు అంటే మనకి ఇష్టం, ఒక్క క్షణం కూడా మనలని విడిచి పెట్టకుండా ఉండే దేవుడు అంటే మనకి ఇష్టం ఉండటం లేదు. ఎందుచేత? దాని విలువ తెలియక మనకి, అసలు వస్తువుకి రూపం లేదు, రూపం లేని దానికి ఇంక పేరు ఏమిటి? రూపం వస్తే పేరు పెడతారు. రూపం లేని దానికి ఇంక పేరే లేదు.

మీరు కృష్ణుడిని ధ్యానం చేసుకోండి, రాముడిని ధ్యానం చేసుకోండి, మీ గురువుని ధ్యానం చేసుకోండి, ఇలా మన పెద్దలు చెబుతూ ఉంటారు. దాని అర్థం ఏమిటి అంటే, కృష్ణుడి రూపాన్ని ధ్యానం చెయ్యగా, చెయ్యగా, కృష్ణుడి నామాన్ని స్మరించగా, స్మరించగా, పెద్దల ఉద్దేశ్యం ఏమిటి అంటే, మహర్షుల యొక్క ఉద్దేశ్యం ఏమిటి అంటే, అవతార పురుషుడి యొక్క రూపాన్ని ధ్యానం చెయ్యగా, చెయ్యగా, ఆ నామాన్ని స్మరించగా, స్మరించగా, మన రూపానికి, మన నామానికి దూరం అవుతాం అని వాళ్ళ ఉద్దేశ్యం. అంటే మనం కృష్ణుడి యొక్క రూపాన్ని ధ్యానం చేస్తుంటే, మన రూపానికి మనం దూరం అవుతాం. కృష్ణుడి నామాన్ని స్మరిస్తుంటే, మన నామానికి మనం దూరం అవుతాం. మనల్ని బంధించేది మన రూపమే, మనల్ని బంధించేది మన నామమే. ఈ రూపదృష్టి, నామదృష్టి మనకి పెరిగిపోయింది. ఎందుచేత అంటే అహంకారానికి foodsupply చేసేది ఇదే. నీ రూపం తోటి, నీ నామం తోటి నువ్వు తాదాత్మ్యం పొందడం వల్ల, నీ అహంకారానికి foodsupply అవుతుంది. ఎప్పుడైతే నీ రూపదృష్టి తగ్గిపోయిందో, నామదృష్టి తగ్గిపోయిందో, నీ అహంకారానికి foodsupply cut అయిపోతుంది. ఎప్పుడైతే foodsupply కట్ అయిపోయిందో నీకప్పుడు స్వరూపం వ్యక్తం అవుతుంది. ఈ దానాలు చేసేవాళ్ళు కూడా వాళ్ళ పేరు కోసమే చేస్తారు కానీ భగవంతుడి ప్రీతి కోసం చెయ్యరు. వాళ్ళకి పేరు వస్తుంది అంటే నాలుగు రూపాయలు దానం చేస్తారు కానీ భగవంతుడి ప్రీతి కోసం చెయ్యరు. వాళ్ళు పేరు కోసం

దానం చేస్తే పేరు వస్తుంది కానీ దైవానుగ్రహం రాదు. నువ్వు ఏదైనా పని చేస్తుంటే, ఏ తలంపు తోటి ఆ పని చేస్తున్నావు? ఏ ఉద్దేశ్యం తోటి నువ్వు పని చేస్తున్నావు? గౌరవం కోసం చేస్తున్నావా? దైవానుగ్రహం కోసం చేస్తున్నావా? దేవుడు చూస్తూనే ఉంటాడు. దేవుడు సర్వసాక్షి. ఆయన ఎక్కడ ఉన్నాడు? నీ హృదయంలోనే ఉన్నాడు. నీ తలంపుని చూస్తూ ఉంటాడు. అందుచేత మనం ప్రపంచాన్ని మోసం చెయ్యగలం కానీ, దేవుడిని మోసం చెయ్యలేము. పుణ్యం ఎక్కడ ఉంది? మనసులో ఉంది. పాపం ఎక్కడ ఉంది? మనసులో ఉంది. ఆత్మానుభవం పొందిన వాడు నేను పుణ్యం చేశాను అనుకోడు, నేను పాపం చేశాను అనుకోడు. పుణ్యాత్ములు అందరూ మేము పుణ్యాత్ములం అనుకుంటున్నారు. చెడ్డవాళ్ళు ఏమనుకుంటున్నారు? వాళ్ళు పైకి అనకపోయినా లోపల మేము పాపం చేశాం అనుకుంటారు. కానీ ఆత్మానుభవం పొందినవాడు నేను పాపం చేశాను అనుకోడు, నేను పుణ్యం చేశాను అనుకోడు. ఎందుచేత? మనసు అనే గడప దాటి వెళ్ళిపోయాడు వాడు. పుణ్యం, పాపం ప్రకృతిలో ఉన్నాయి. పుణ్యం, పాపం మనస్సులో ఉన్నాయి. చైతన్యంలో పుణ్యం లేదు. చైతన్యంలో పాపం లేదు. చైతన్యం ఎవడికి అయితే అనుభవంలోకి వచ్చిందో, వాడు నేను పుణ్యాత్ముడను అనుకోడు, నేను పాపాత్ముడను అనుకోడు.

నువ్వు దేని గురించి అయితే స్మరిస్తున్నావో, ఏది పొందాలని నువ్వు ప్రయత్నం చేస్తున్నావో చివరికి అది నీకు మిగులుతుంది. నీ చింతన బట్టే అది ఆధారపడి ఉంటుంది. ఏ వస్తువుని అయితే పొందాలి అనుకుంటున్నావో, ఆ వస్తువు మీదే నీ తలంపుని అట్టే పెట్టి ఉంచుతుంది ధ్యానం. దేవుడి తలంపు తప్పించి, దేవుడి చింతన తప్పించి, దేవుడి ధ్యాస

**ఈశ్వరుడిని స్మరించుకుంటూ ఉంటే, ఆయన రూపాన్ని ధ్యానించుకుంటూ ఉంటే, మీకు స్పష్టంగా ఆయన అనుగ్రహం తాలూకు స్పర్శ లోపల తెలుస్తూ ఉంటుంది.**



తప్పించి, దేవుడి ధ్యానం తప్పించి, ఇతర చింతలు, ఇతర తలంపులు, ఇతర ఊహలు అవి దేహానికి సంబంధించినవి అవ్వవచ్చు, ఇంద్రియాలకి సంబంధించినవి అవ్వవచ్చు, నీ మనస్సులో ఉన్న గొడవలు అవ్వవచ్చు, ఏ తలంపులు వచ్చినప్పటికీ, ఒక్క దేవుడు చింతన తప్పించి ఏ చింతన వచ్చినా ఆ చింతన బయటకి తోలేసేదే ధ్యానం. మమ్మల్ని ధ్యానం ఎంతకాలం చెయ్యమంటారు? అని మీరు అడగక్కరలేదు. దేవుడి ధ్యాస తప్పించి, ఏ ఇతర చింతన మీకు వస్తున్నప్పటికీ, ఆ విషయ చింతన ఉన్నంత కాలం మీరు ధ్యానం చేస్తూ ఉండవలసిందే. నీకు అనారోగ్యం ఉన్నంతకాలం మందు వాడుతూ ఉండవలసిందే. ఎంతకాలం అనే ప్రశ్న అక్కర్లేదు. తెపాలాకి మసి ఉన్నంతకాలం తోముతూ ఉండవలసిందే. ఎంతకాలం అనే ప్రశ్న లేదు. నువ్వు చేసే సాధన యొక్క intensity బట్టే నీకు సాక్షాత్కారం కలుగుతుంది. నువ్వు లాంఛనానికి చేస్తే సాక్షాత్కారం కలగదు. నీ సాధన యొక్క లోతుల్ని బట్టి నీకు సాక్షాత్కారం కలుగుతుంది. గౌరవానికి చేసే పనులు, లాంఛనానికి చేసే పనులు చూసి భగవంతుడు మోసపోడు. నీకంటే తెలివి కలవాడే దేవుడు. నీకు మందు ఎంతవరకు కావాలి? రోగం తగ్గేవరకు మందు వాడవలసిందే. ధ్యానం ఎంతవరకు చెయ్యాలి అంటే, నీకు నిజ స్థితి తెలిసే వరకు ధ్యానం చేస్తూ ఉండవలసిందే!

రమణమహర్షి గారిని ఒక ప్రశ్న అడిగారు దేవుడు ఉన్నాడా అని. దేవుడు ఉన్నాడా అంటే పండితులు తొంబై ఆర్గుమెంట్లు చెబుతారు ఉన్నాడు అని, లేడు అని. ఆయన ఊరికే ఒక చిన్న రిప్లై తోటి, అప్పటికప్పుడు చిన్న వాక్యం తోటి తేల్చేస్తారు. భాగవతంలో ఇలా ఉంది, భారతంలో ఇలా ఉంది అని చెప్పరు. వస్తువు ఆయన అనుభవంలో ఉంది. అనుభవం లోంచి తీసి సమాధానం చెబుతాడు వాడు ఋషి. దేవుడు ఉన్నాడా అని అడిగాడు ఒకడు, నువ్వు ఉన్నావా అని అడిగారు, నేను ఉన్నాను అన్నాడు. నువ్వు ఉంటే వాడు లేకుండా ఎక్కడకు పోతాడు అన్నారు. ఎంత wonderful reply చూడండి అది. ప్రశ్న ఏమిటి అంటే దేవుడు ఉన్నాడా అని అడిగాడు, నీవు ఉన్నావా అన్నారు, నేను ఉన్నాను అన్నాడు. నీవు ఉంటే వాడు ఎక్కడకిపోతాడురా, వాడు ఉన్నాడు అన్నారు. నువ్వు చేసిన పుణ్యానికి సుఖం ఇవ్వటం కోసం, నువ్వు చేసిన పాపానికి దుఃఖం ఇవ్వటం కోసం, నువ్వు ఉంటే వాడు ఉన్నాడు.

నువ్వు ఉన్నంతకాలం వాడు లేకుండా పోతాడు అనుకోకు. నిన్ను కట్టురాడుకి కట్టేసి బాదటానికి వాడు కూడా ఉన్నాడురా అన్నారు.

ఇప్పుడు మనందరం పుట్టాం అనుకుంటున్నామా? పుట్టలేదు అనుకుంటున్నామా? పుట్టాం అనుకుంటున్నాం కదా. అందుచేత మనకి మోక్షం రాదు. ఎవడికైతే తాను పుట్టలేదు అన్న సంగతి తెలుస్తుందో వాడికి మోక్షం వస్తుంది. ఏది పుట్టలేదు? ఆత్మ పుట్టలేదు. వాడు ఎవడు? ఆత్మ. ఎవడికైతే ఆత్మానుభవం వచ్చిందో వాడికే మోక్షం వస్తుంది. ఎవడికైతే ఆత్మజ్ఞానం వచ్చిందో వాడికే మోక్షం వస్తుంది. ఎవడికైతే ఆత్మ విద్య వచ్చిందో వాడికే మోక్షం వస్తుంది. అది kingly సైన్సు అన్నాడు కృష్ణుడు. ఆత్మ విద్య ఎటువంటిది అంటే అన్ని విద్యలలోకి రాజు అని చెప్పాడు. దేహబుద్ధి ఉన్నంతకాలం, ఈ దేహగతమైన నేను ఉన్నంతకాలం, నువ్వు ధ్యానం చెయ్యవలసిందే, జపం చెయ్యవలసిందే, సాధన చెయ్య వలసిందే, ఇందులోంచి escape అవ్వడానికి అవకాశం లేదు. హ్యూమన్ మైండ్ చాలా complicated మైండ్. హ్యూమన్ మైండ్ complicated కాబట్టి సబ్జెక్టు సింపుల్ గా చెబితే ఎవరికీ ఇష్టం ఉండదు. Complicated గానే చెప్పాలి. ద్వైతం గురించి, అద్వైతం గురించి పుస్తకాలు రాశారు కొంతమంది, రమణమహర్షి గారు రెండు ముక్కలలో ద్వైతం అంటే ఏమిటో, అద్వైతం అంటే ఏమిటో, ఒకటవ తరగతి చదువుకున్న వాడికి కూడా అర్థం అయ్యేలా చెప్పారు. మీకు దేహబుద్ధి ఉంటే ద్వైతం. దేహబుద్ధి లేకపోతే అద్వైతం. Wonderful చూడండి ఈ టీచింగ్. ద్వైత, అద్వైతాలు గురించి రెండు ముక్కల్లో తేల్చారు. నీకు దేహబుద్ధి ఉంటే ద్వైతం ఉన్నట్టే, నీకు దేహబుద్ధి లేదు అనుకో ఉన్నది అద్వైతమే. ఇంత naturalగా ఏ బుక్‌లో ఉందో చెప్పండి. ఇది చాలా సింపుల్‌గా ఉంది. ఇది చెబితే మనకి నచ్చదు. ఎందుచేత? మన బ్రెయిన్‌కి complication కావాలి. సింపుల్‌గా చెప్పారు అనుకోండి, ఏదో చెప్పారు అనిపిస్తుంది. ఒకడు తుండు గుడ్డ కట్టుకుని వచ్చాడు అనుకోండి వాడిని పెద్ద గౌరవం చెయ్యరు. పెద్ద లాంగ్ కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని, పెద్ద ఆర్భాటంగా వచ్చాడు అనుకోండి ఎక్కువ గౌరవం చేస్తారు. తుండు గుడ్డ కట్టుకుని వచ్చాడు అనుకోండి వాడిని పెద్ద గౌరవం చెయ్యరు. మైండ్‌లో ఉంది ఆదోషం. ఈ జన్మకి, రాబోయే జన్మకి చావు ఎటువంటిదో,

ఈవాళ పగలుకి, రేపటి పగలుకి నిద్ర అటువంటిది అన్నారు భగవాన్. అంటే నిద్ర కూడా చిన్న చావు. అయితే నిద్రకి, మరణానికి తేడా ఏమిటి అంటే నిద్రపోయిన తరువాత samebodyలో లెగుస్తున్నాము మనం. మరణించిన తరువాత మరొక దేహంలో లెగుస్తాము. నిద్రపోయిన తరువాత ఇవాళ ఏ బాడీలో ఉన్నామో, రేపు కూడా అదే బాడీలో లేస్తున్నాము కానీ మరణించిన తరువాత మటుకి దేహం మారుతుంది, కొత్త దేహంలో మనం లెగుస్తాము. అంతే తేడా, నిద్ర కూడా చిన్న చావు తోటి సమానం. గాఢనిద్రలో నీకు తెలియకుండా నీ మనస్సు నీ పుట్టింటికి వెళుతుంది. నీ హృదయ స్థానంలోకి వెళుతుంది. నీ సహజస్థితి నువ్వు పొందుతున్నావు గాఢనిద్రలో. గాఢనిద్రలో నీకు తెలియకుండా నీ మనస్సు ఎలా నీ హృదయ స్థానంలోకి వెళుతుందో, అలా జాగ్రదావస్థలో నువ్వు ప్రయత్నం చేసి నీ మనసుని ఆ హృదయ స్థానానికి పంపాలి, అదే సాధన. అదే నిజ విచారణ. మీకు అర్థం అవుతోందా? జాగ్రదావస్థలో ఉండగా, మీరు భక్తి మార్గం, ధ్యాన మార్గం, కర్మ మార్గం, యోగ మార్గం, ఏదో ఒక మార్గంలో మీరు ప్రయాణం చేసి, గాఢనిద్రలో నీ మనసు ఏ విధంగా అయితే నీ ప్రయత్నం లేకుండా హృదయంలోకి వెళుతుందో, అలాగే జాగ్రదావస్థలో ప్రయత్నం చేసి నీ మనసుని హృదయం స్థానంలోకి పంపించడమే యోగం యొక్క లక్ష్యం.

చిత్త వృత్తిని నిరోధించడమే యోగం అని పతంజలి చెప్పాడు. నీ మనస్సులో ఉన్నటువంటి వృత్తిని, దానిని నిరోధించి మనసుని అంతర్ముఖ పరచడమే యోగం యొక్క లక్ష్యం. మైండ్ బ్రెయిన్‌లో ఎంత సహజంగా ఉందో, అంత సహజంగా, అంత సరళంగా, నీ మనస్సుని హృదయ స్థానంలో నిలబెట్టి ఉంచడమే యోగం యొక్క లక్ష్యం. అదే భక్తి, అదే జ్ఞానం, అదే కర్మ, అదే యోగం. మీ మనస్సుని హృదయంలో నిలబెట్టి ఉంచితే అక్కడ



**సాధన బాగా చెయ్యాలి అనుకునేవారు సమాజంతో ఎంతవరకూ ఉండాలో అంతవరకే ఉండాలి. ఎక్కువగా ఉండకూడదు.**

మనస్సు కరిగిపోతుంది. ఇప్పుడు ఏ విధంగా అయితే నీకు మనస్సు నేనుగా వ్యక్తం అవుతుందో, మనస్సు కరిగిపోయిన తరువాత నువ్వు పోతావు అనుకోకు, నువ్వు ఎవరవో నీకు తెలుస్తోంది. ఎవడైతే దేవుడు అని నువ్వు అనుకుంటున్నావో, ఎవడైతే వైకుంఠ వాసి అనుకుంటున్నావో, ఎవడైతే కైలాసానికి అధిపతి అనుకుంటున్నావో, ఆ దేవుడే, ఏ వస్తువు అయితే యూనివర్స్‌ని సపోర్ట్ చేస్తుందో, ఆ వస్తువే నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. జ్ఞాని శక్తి లేకుండా ఉండడు, జ్ఞాని శాంతి లేకుండా ఉండడు, జ్ఞాని కాంతి లేకుండా ఉండడు, జ్ఞాని existence లేకుండా ఉండడు, జ్ఞాని ఆనందం లేకుండా ఉండడు. చైతన్యానికి ఎటువంటి గుణాలు అయితే ఉన్నాయో, జ్ఞాని చైతన్యంతోటి తాదాత్మ్యం పొందుతాడు కాబట్టి, ఆ చైతన్యం యొక్క గుణాలు అన్నీ కూడా జ్ఞానిని వరిస్తాయి.

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే నేను పుట్టాను అనుకున్న వాడికి ఎవడికి మోక్షం రాదు. ఎవరు పుట్టారు? దేహం పుట్టింది. నేను పుట్టాను, నేను పుట్టాను అంటే వాడికి ఏ బుద్ధి ఉంది? దేహబుద్ధి ఉంది. ఆ దేహం చుట్టూనే తిరుగుతూ ఉంటాడు వాడు. ఎవడికైతే వాడు పుట్టలేదు అన్న సంగతి తెలుస్తుందో వాడికి ఒక్కడికి మాత్రమే మోక్షం వస్తుంది అన్నారు. మనం అందరం పుట్టాం అనుకుంటున్నామా? పుట్టలేదు అనుకుంటున్నామా? పుట్టాం అనుకుంటున్నాం అందుచేత మోక్షం సున్నా. మనం హీరోలము కాదు జీరోలము. మీకు అర్థం అవుతోందా? మనం అందరం పుట్టాం, పుట్టాం అనుకుంటున్నాం. ఎవరు పుట్టారు? దేహం పుట్టింది. ఎవడికైతే తాను పుట్టలేదు అన్న సంగతి తెలుస్తుందో, తాను అంటే ఎవడు? ఆత్మ. అందుచేత ఆత్మకి పుట్టుక లేదు. ఎప్పుడైతే వాడికి ఆత్మానుభవం వచ్చిందో అప్పుడు వాడు పుట్టలేదు అన్న సంగతి వాడికి తెలుస్తోంది. వాడికిరా మోక్షం? ఎవడికైతే తాను పుట్టలేదు అన్న సంగతి అనుభవంలోకి వచ్చిందో వాడికి మోక్షం. ఆత్మకి మరొక పేరే మోక్షం. ఆత్మకి మరొక పేరే శాంతి.

మీకు దేహం నేనుగా ఎలా వ్యక్తం అవుతుందో, మీ మనస్సు మీకు నేనుగా ఏ విధంగా వ్యక్తం అవుతుందో, మీ ఇంద్రియాలు ఏ విధంగా అయితే మీకు నేనుగా వ్యక్తం అవుతున్నాయో, అంత naturalగా ఆత్మ మీకు నేనుగా వ్యక్తం అవ్వాలి. వాడికి మోక్షం. నేను

అనేటప్పటికి నీకు ఏది గుర్తొస్తుంది? దేహం గుర్తొస్తుంది. అంతేకదా, నీ దేహమే నేనుగా వ్యక్తం అవుతుంది. మనస్సే నేనుగా వ్యక్తం అవుతుంది. ఈ అడవి లోంచి దాటి బయటకి వెళితేనే కానీ స్వరూపం నేనుగా వ్యక్తం కాదు. మనం BMIని మోసుకు తిరుగుతూ ఉంటాం. తెలివైన వాడు నేను తెలివైన వాడిని అనుకుంటాడు. అందమైన వాడు నేను అందమైన వాడిని అనుకుంటాడు. అంటే వాడి body తోటి identify అవుతాడు, వాడి తెలివితేటల తోటి identify అవుతాడు. వాడు మైండ్ తోటి identify అవుతాడు. BMI తోటి తాదాత్మ్యం ఉన్నంతకాలం అసలు వస్తువు తోటి నువ్వు తాదాత్మ్యం పొందలేవు. B అంటే Body, M అంటే Mind, I అంటే Intellect. వీటి తోటి తాదాత్మ్యం నీకు తెగిపోయినప్పుడే నీ హృదయంలో ఉన్న నిజం నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. ఆ నిజానికి చావు లేదు. ఆ నిజానికి పుట్టుక లేదు. ఆ నిజమే చైతన్యం. ఆ నిజమే యూనివర్స్ కి కూడా ఆధారంగా ఉంది.

నువ్వు హృదయపూర్వకంగా భగవంతుడిని అనుభవంలోకి తెచ్చుకోవాలని సాధన చేస్తుంటే, నీ హృదయంలో ఉన్న సత్యవస్తువే గురువుగా ఒక రూపం ధరించి వస్తుంది. దేవుడు పుడతాడు, మనం పుడతాము. కానీ దేవుడికి శరీరం వచ్చినప్పుడు కూడా తాను దేహమాత్రుడిని కాదు అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది. వాడు దేవుడు. మనకి ఏ విధంగా అయితే శరీరం ఉందో, కృష్ణుడికి కూడా శరీరం ఉండవచ్చు. కానీ కృష్ణుడు ఆ శరీరానికి పరిమితం అయ్యి ఉండడు. శరీరానికి పరిమితం అయినవాడు జీవుడు. శరీరానికి పరిమితం కానివాడు దేవుడు. దేవుడికి, జీవుడికి తేడా ఏమిటి అంటే, కృష్ణుడికి కూడా శరీరం ఉంది కానీ ఆ శరీరానికి వాడు పరిమితుడు కాదు. కాబట్టి వాడు దేవుడు. మనం శరీరానికి పరిమితం అయ్యాం కాబట్టి మనం జీవులం. మన అందరికి నిద్ర అంటే ఇష్టం, చావు అంటే భయం. నిద్రకి, చావుకి తేడా ఏమిటి అంటున్నారు భగవాన్, నిద్ర అంటే అందరికీ ఇష్టం. కానీ చావు వస్తుంది అంటే మటుకి చాలా భయం. ఆ తేడా ఎందుకు వస్తోంది? నిద్ర, చావు రెండూ సమానమే. నిద్రపోయే వాళ్ళు చచ్చిన వాళ్ళతో సమానం అని మనవాళ్ళు చెబుతూ ఉంటారు కదా, రెండు సమానం అయినపుడు నిద్ర అంటే మనం ఇష్ట పడుతున్నాం, కానీ చావు అంటే మనకి ఇష్టం లేదు. కారణం ఏమిటి? రేపు ఈ

దేహం మనకి కనిపిస్తుంది కదా, మళ్ళీ ఈ ప్రపంచం కనిపిస్తుంది కదా అని ఒక తలంపు ఉంటుంది పడుకునే ముందు, కేవలం ఆ తలంపు వల్ల వీడికి నిద్ర అంటే భయం కలగడం లేదు. కాని చనిపోతే మళ్ళీ దేహం కనపడదు, ఊరు కనపడదు అనే తలంపు వల్లే చావు అంటే భయం వస్తుంది. నిద్ర అంటే భయం లేకపోవడానికి కూడా తలంపే కారణం. మరణం అంటే భయం వేయడానికి కూడా తలంపే కారణం. దీనికి తలంపే కారణం, దానికి తలంపే కారణం. అసలు తలంపు అనేది నిజం కాదు. నిజం అనేది నీ హృదయంలో ఉంది.

ఇప్పుడు మనకు ఉన్న అలవాట్లు దేహం చనిపోయినప్పుడు ఎక్కడికీ పోవు. స్మశానంలో ఆ అలవాట్లు కాలవు. దేహం కాలుతుంది, ఇంద్రియాలు కాలిపోతాయి. మళ్ళీ కొత్త దేహం లోకి ఈ అలవాట్లు అన్నీ వచ్చేస్తాయి. కొంతమంది బాగా డబ్బు వచ్చిందని, అధికారం వచ్చిందని గర్వం పెంచుకుంటారు. కాల ప్రవాహంలో డబ్బు పోవచ్చు, పదవి పోవచ్చు. కానీ వచ్చే జన్మకి ఈ గర్వం అంతా వచ్చేస్తుంది. రమణమహర్షి గారిని ఒక ప్రశ్న అడిగారు. హృదయంలో దేవుడు ప్రత్యక్షంగా ఉన్నాడు అంటున్నారు. హృదయంలో వస్తువు ప్రత్యక్షంగా ఉందంటున్నారు, సజీవంగా ఉంది అంటున్నారు. సజీవంగా ఉన్న వస్తువు నాకు ఎందుకు అనుభవంలోకి రావడం లేదు అని ఒకరు ప్రశ్న వేశారు. నా దేహం నాకు అనుభవంలో ఉంది కదా, నా మనస్సు నాకు అనుభవంలో ఉంది కదా, నా గుణం నాకు అనుభవంలో ఉంది కదా, అదే విధంగా నా హృదయంలో ఉన్న వస్తువు నాకు ఎందుకు అనుభవంలోకి రావడం లేదు అని ప్రశ్న. అప్పుడు భగవాన్ ఏమి చెప్పారు అంటే నీ తలంపుల యొక్క వేగం, నీ గుణాల యొక్క వేగం, నీ అలవాట్ల యొక్క వేగం వల్ల నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తం కావటం లేదు. అలవాట్ల లోంచి, నీ ప్రకృతి గుణాల లోంచి, విడుదల పొందు. వస్తువు ఉందో, లేదో అప్పుడు నీకు తెలుస్తోంది అన్నారు.

రమణమహర్షిగారు ఒక చక్కటి మాట చెప్పారు. ఆ వస్తువు ఎలా ఉంటుందో ఊహించడానికి నువ్వు ప్రయత్నం చెయ్యకు. ఊహించడానికి ప్రయత్నం చేస్తే నీ మనస్సే వెళ్లి అక్కడ కూర్చుంటుంది. దీనివెంట గొడవ కూడా తీసుకు పోతుంది అక్కడకి, ఆ

వస్తువు ఎలా ఉంటుందో ఊహించడానికి నువ్వు ప్రయత్నం చెయ్యకు, దానిని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. దానిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యి. Wonderful టీచింగ్ చూడండి. నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. దానిని ఊహించడానికి ప్రయత్నం చెయ్యకు, దానిని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. దానిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యి. ఆ వస్తువు నీ మాటలకి అందకపోయినా, నీ ఇంద్రియాలకి అందకపోయినా, నీ మనస్సుకి అందకపోయినా, నీ అనుభవానికి అందుతుంది. అది అనుభవైకవేద్యం. లాయర్ ఏ విధంగా అయితే లా ని ప్రాక్టీస్ చేస్తాడో, డాక్టరు ఏ విధంగా అయితే మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తాడో, అదే విధంగా నువ్వు truthని ప్రాక్టీస్ చేస్తే నీకు truth వ్యక్తం అవుతుంది. నీ హృదయంలో ఒక నిజం ఉంది, నువ్వు ఉంది అనుకున్నప్పడు కూడా అది ఉంది. లేదు అనుకున్నప్పడు కూడా అది ఉంది. లేకుండా ఎక్కడకి పోదు. దానిని తెలుసుకుంటే సుఖ పడతావు, తెలియకపోతే నువ్వు దుఃఖ పడతావు. జన్మ జన్మలకి ప్రతీ జన్మకి కూడా ఏదో ఒక దుఃఖం నిన్ను తరుముకుంటూ వస్తుంది. దుఃఖం లేని స్థితికి నువ్వు ఎదగాలి అంటే దుఃఖం లేని స్థితి ఒక్క ఆత్మ లోనే ఉంది. దానిని తెలుసుకోవటానికి, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**వివిక్త సేవీ లఘ్వాశీ యత వాక్కాయ మానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ 18-52 ॥**

**తాత్పర్యము :** పరిశుద్ధమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడును, తేలికయిన సాత్వికాహారమును మితముగా భుజించు వాడును, మనోవాక్కాయములను అదుపులో ఉంచుకొనిన వాడును, నిరంతరము ధ్యానయోగ పరాయణుడైన వాడును, ధృఢ వైరాగ్యమును ఆశ్రయించిన వాడును - పరబ్రహ్మమునందు స్థితుడగుటకు పాత్రుడగును.

వివిక్త సేవీ లఘ్వాశీ - భగవంతుడు మన సాధనకి ఉపయోగపడే మాట చెపుతున్నాడు - ఆహార విహారాలలో జాగ్రత్తగా ఉండండి. యుక్తంగా తినండి. మామూలుగా మన దేహానికి అవసరం అయిన దానికంటే ఎక్కువ తినేస్తున్నాము, అది మనకి తెలియదు. మీ శరీరం కూడా గురువే. కొంత తినేటప్పటికి సరిపోతుంది అని మీ శరీరం చెపుతుంది. కానీ రుచిగా ఉందని ఎక్కువ తినేస్తారు. దానివల్ల మెదడుకి వెళ్లవలసిన రక్తం తగ్గిపోతుంది, వెంటనే నిద్ర వచ్చేస్తుంది. ఏదైనా చదివినా అర్థం కాదు. అందుచేత ఎక్కువ తినేయవద్దు. దేహం నిలబడటానికి సరిపడి తినండి.

తరువాత రోజూ ఒక గంటసేపు ఏకాంతవాసం చేయమంటున్నాడు భగవంతుడు. అస్తమానూ జనంతోటి కలిసి ఉండకండి. ప్రతిరోజూ మీ ఇంటిలో ఒక గంటసేపు ప్రశాంతంగా కూర్చోండి. ఏకాంతంగా కూర్చోవటం వల్ల మీ మనస్సులో ఏముందో మీ బలహీనతలు ఏంటో మీకు తెలుస్తాయి, పదిమందిలో కూర్చున్నప్పుడు తెలియవు. ఎక్కడికో అడివికో, బదరీకో పారిపోవక్కరలేదు, మీ ఇంటి దగ్గరే ఒక గంటసేపు ఏకాంతంగా కూర్చోండి. ఎదుటివాళ్లు మిమ్మల్ని ఎలా చూస్తున్నారో అలా మిమ్మల్ని మీరు చూసుకోండి. మీ మనస్సులో ఏం జరుగుతోందో పరిశీలించుకుంటే మీ బలహీనతలు, మీ కోరికలు, మీ స్వభావం, మీకున్న

అలవాట్లు మీకు తెలుస్తూ ఉంటాయి. రోగం తెలిసాక దాన్ని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయవచ్చు. అసలు రోగమే తెలియకపోతే మనం మందులు వాడం కదా!

యతవాక్కాయ మానసః - మనకి పుణ్యం తెచ్చినా పాపం తెచ్చినా ఈ మూడే - శరీరం, మనస్సు, వాక్కు. భగవంతుడు ఇచ్చాడు కదా అని వీటిని మీ ఇష్టం వచ్చినట్టు ఉపయోగించకండి. జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మీ శరీరం ఎప్పడైనా కాలి బూడిద అయిపోయేదే. కాలిస్తే బూడిద అవుతుంది, కప్పెడితే మట్టి అవుతుంది. ఆ శరీరాన్ని కూడా మీరు ఊరికే దుర్వినియోగం చేయకండి. దానితో అవసరమైన పనులే చేసుకోండి. ఇతరుల గొడవలలోకి ప్రతిదానికీ వెళ్ళి కలగచేసుకోకండి. అవసరమైన సాధన చేసుకోండి. నోటిలో నాలుక ఉందని మీకు ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి. ఎంతవరకూ మాట్లాడాలి, ఎంతవరకూ మాట్లాడకూడదు. ఏ మాట మాట్లాడాలి, ఏ మాట మాట్లాడకూడదు చూసుకొని యుక్తంగా మాట్లాడండి. శరీరాన్ని, మనస్సుని, మాటను స్వాధీనంలో పెట్టుకోండి.

మీకు తలంపులు వస్తున్నాయి కదా. చెడు తలంపులు వస్తున్నాయా మంచి తలంపులు వస్తున్నాయా అని ఏకాంతంగా కూర్చుని మీ మనస్సులో ఎటువంటి తలంపులు వస్తున్నాయో చూసుకొంటూ ఉండండి. మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. అర్జునా, నీ మనస్సులో ఏముందో నీ ఇంటిలో వాళ్ళకు, నీ పక్కింటివాడికి ఏం తెలుస్తుంది? అందుచేత నీ అంతట నువ్వే నీ మనస్సులో ఏముందో, ఏం జరుగుతోందో నీ మనస్సుతోటి చూసుకో. మీయింటికి చుట్టాలు వస్తే, గ్యాస్ తోటి లేకపోతే పిడకలు పెట్టి కాఫీ కాసిస్తారు. అంతేకాని మీ దగ్గర వెయ్యిరూపాయి కాగితాలు ఉన్నాయి అని, రూపాయలు కాగితాలు అంటించి కాఫీ కాసిస్తే ఎలా ఉంటుందో, మీ శరీరాన్ని మీ మనస్సుని మీ వాక్కుని అవసరం లేని విషయాలకి ఖర్చు పెట్టుకొంటే అలాగే ఉంటుంది. ఈ మూడింటినీ పాడుచేసుకోకండి.

ధ్యానయోగ పరో - ధ్యానయోగం అలవాటు చేసుకోండి. మీకు ధ్యానం అలవాటు లేకపోతే జపం ఎక్కువ చేసినా అది ధ్యాన స్థితికి దారి తీస్తుంది. ధ్యానాన్ని మీ స్వభావం చేసుకోవాలి. ధ్యానం వల్ల మనస్సుకి ఆగ్రహం తగ్గుతుంది, నిగ్రహం వస్తుంది. బుద్ధుడు ఎక్కువ ధ్యానం చేసేవాడు. బుద్ధుడి దృష్టిలో పూజ అంటే ధ్యానమే. బుద్ధుడి దృష్టిలో జపం అంటే ధ్యానమే. బుద్ధుడు ధ్యాన ప్రియుడు, ఎక్కువ ధ్యానం చేసేవాడు.

నిత్యం వైరాగ్యం సముపాశ్రితః - మీరు వైరాగ్యాన్ని ఆశ్రయించండి. మీకు ఆత్మజ్ఞానం కావాలంటే వైరాగ్యాన్ని ఆశ్రయించండి. అంటే వైరాగ్యం ఎందుకు ఆశ్రయించమంటున్నాడు అంటే, వైరాగ్యాన్ని ఆశ్రయిస్తే మీరు బాగుపడతారు, శుద్ధి అవుతారు. అది జ్ఞానానికి తీసుకెడుతుంది.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# అరుణగిరి - దీపం

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం దిII 26-11-2023న అరుణాచల దీపోత్సవాన్ని జరుపుకోబోతున్నాం. కార్తీక దీపోత్సవం అరుణాచలంలో అతి ప్రసిద్ధమైన పండుగ. ఈ దీపోత్సవం అనేక వేల సంవత్సరాల నుండి జరుపబడుచున్నదని చెబుతారు. ఈ రోజు అనంతుడైన సదాశివుడు బ్రహ్మ, విష్ణువులకు జ్యోతి స్వరూపముగా వ్యక్తమైన రోజు. సదాశివుడు వారి ఇద్దరి మధ్య కలహమును తీర్చి అనుగ్రహించాడు. ఆ అనుగ్రహమే గిరి రూపు దాల్చింది; దేవతలకు, మానవులకు ఆరాధ్యమైంది అదే అరుణాచలం. అరుణగిరి శిఖరం మీద జ్యోతిని వెలిగిస్తారు, దాని మూలములోకి వెళితే స్వయముగా అరుణాచలమే జ్యోతి స్వరూపం. బ్రహ్మ, విష్ణువులకు జ్యోతి స్తంభంగా గోచరించిన శివుడే తరువాత గిరి రూపం ధరించాడు. భగవాన్ కార్తీక దీపం యొక్క నిజ తత్వాన్ని మురుగనార్‌కి ఇలా వివరించారు "మనందరికి దేహం నేనుగా వ్యక్తం అవుతోంది, అట్టి దేహము నేను అను మూల తలంపును దాని మూలమైన హృదయంలో నశింపజేసి, నిజమైన నేనును తానుగా నేనుగా అనుభవైకవేద్యం చేసుకోవడమే నిజమైన దీప దర్శనం. కార్తీకదీపం మనస్సును లోనికి మరలించి హృదయంలోకి చేర్చి అందు మునుగునట్లు చేస్తుంది". అరుణాచలమును ఆత్మగా, అచల గురువుగా భావించడం అనాదిగా వస్తున్నది. అరుణగిరిపై గురుభావము నిలిపి గురువుగా భావించిన 16వ శతాబ్దానికి చెందిన మహాయోగి గుహైనమశ్శివాయ. అదేవిధముగా అనేకమంది యోగులు, నేటి కాలంలో భగవాన్ శ్రీ రమణమహర్షి అరుణాచలమును గురువుగా పూజించారు. తాను శరీరధారియై ఉన్నకాలములో, భగవాన్ శ్రీరమణమహర్షి జీవితంలో గిరి ప్రదక్షిణ అంతర్భాగం. గిరి ప్రదక్షిణ చేయడం అంటే, పరమశివుని చుట్టూ ప్రదక్షిణ చేయడమే, అరుణగిరి అంటే విశ్వ కేంద్రం. అరుణగిరికి ఒక పేరు ఉంది అది 'చంపు చంపెడు మందు' అని, శరీరాన్ని చంపకుండా అహంకారాన్ని చంపేస్తుంది. అరుణాచలం ఎందుకు వచ్చిందో? అది చేసే పని ఏమిటో? భగవాన్ అక్షరమణమాల మొదటి ద్విపదలోనే చెప్పారు. 'అరుణాచలమనుచు స్మరియించువారల అహము నిర్మూలింతువు అరుణాచలా' అని. భగవాన్ శ్రీరమణుని చిన్న వయస్సులోనే అరుణగిరి తనవైపు ఆకర్షించుకుని తనవాడిని చేసుకుంది. అరుణగిరి మాంసనేత్రాలకే శిలాకారంగాని, అసలు జ్యోతి స్వరూపమే అన్నారు భగవాన్. మనకు సామాన్యంగా కనిపించే కొండ భగవాన్‌కి గురువు మరియు చిదానంద బ్రహ్మము. ఈ గిరికి అన్నామలై అని పేరు ఉంది, అంటే అందని కొండ అని అర్థం. అనగా మన మనస్సుకు, బుద్ధికి అందని కొండ అని అర్థం; మనస్సుకి, బుద్ధికి అందకపోయినా అనుభవానికి అందుతుంది. పవిత్ర అరుణాచలం అనాదిగా అనేకమంది మహాత్ములకు, ఋషులకు, సత్యాన్వేషకులకు ఆవాసముగా ఉంది. భగవాన్ శ్రీ రమణమహర్షి 1896 నుండి 1950లో మహానిర్వాణం వరకు ఏబది నాలుగు సంవత్సరములు, తన ఆవాసముగా చేసుకున్నారు. అరుణాచలం మన అహంకారాన్ని ఆత్మగా, అమృతంగా పరివర్తన చేసే క్షేత్రం. అరుణాచలం అంటే అనుగ్రహమే! స్వరూపమే!

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మానసిక జీవితం తెలియనివానికి - ఆధ్యాత్మిక జీవితం రాదు

మనం సాధనామార్గంలో పయనించినప్పడే ప్రకృతి మనుషుల భావాలు మనలను కలవరపెడతాయి, అప్పడే మనం అప్రమత్తము అవ్వాలి. ధ్యానంలో ఉన్నప్పడు ఆ ఆలోచనలు ఉదయించినప్పడు ఓ మనసా ఈ వ్యాపకంలో ఉన్నప్పడు అదే నీ లక్ష్యమా అని వాటిపట్ల వైరాగ్యం, ఉదాసీనత వృద్ధిచేసుకొని గురుప్రేమలో మునగాలి. అసలు మనం నామరూపాల్లోనే జీవిస్తూ నేను-నాది, నువ్వు-నీది అని కల్పితభావాలను పెంచుకొంటున్నాము. బిడ్డలు, ఆస్తులు, మమకారాలు, ఇష్టం, అయిష్టం దీనివల్ల మనకు తెలిసింది ఏమిటి? మనం ఆత్మ అయినప్పటికి దాని ప్రత్యక్ష అనుభవానికి చాలాదూరంలో ఉన్నాము., ఒక మహాపండితుడు "అంతా బ్రహ్మమే" అని పాడుతూ వెళుతూ ఉంటే ఒకడు ముల్లుతో మెడ మీద గుచ్చగా ఉగ్రుడై "ఓరి మూర్ఖుడా నేను ఫలానా వారి మనుమడిని నన్ను ముల్లుతో గుచ్చుతావా" అన్నాడు. మహాజ్ఞానియైన సదాశివబ్రహ్మేంద్రులు అదే పాటపాడుతూ వెళుతూఉంటే ఒక సుల్తాన్ వెనుకనుంచి కత్తితో ఆయన చేయి నరికినా గుర్తు రాలేదు. బ్రహ్మానుభవంలో వాస్తవంగా జీవించే వరకూ నేను బ్రహ్మమని ప్రకటిస్తూ తిరిగే అర్హత మనకు లేదు. విషయవృత్తులు వీడనంతకాలం వెలితి, విషాదం మనలను వదలదు. బాహ్య విషయాలమీద ప్రీతి లేకుండా మనస్సును సమాయత్తం చెయ్యాలి. కారణం కాలానికి లొంగేవి, అన్నీ మరణించేవే చైతన్యానికి మరణంలేదు. 'నేను'ను వదిలివేయటానికి సిద్ధంగా ఉంటే ప్రేమద్వారాలు తెరుచుకొంటాయి. కామం ప్రేమయొక్క భ్రమ, నీడ అది ప్రకృతి సమ్మోహన శక్తి దైవిక ప్రేమ దానికి భిన్నమైనది. తోడేలు వంటి మనుషుల మంచితనాన్ని, నక్కజిత్తుల వంటివాడిని, భోగందాని వంటి మనోవృత్తిగల వాన్ని నమ్మితే పిచ్చివారమౌతాము. లౌకిక ప్రపంచంలో సాధకుడు వీటిని తెలుసుకొనితీరాలి. యుక్తి యుక్తములైన వాక్యాలు బాలుడు చెప్పినా గ్రహించాలి. అవి లేని మాటలు, బ్రహ్మదేవుడు చెప్పినా తిరస్కరించాలి. శ్రీనాన్నగారు "నేను బ్రహ్మమే అనే మాటను మనస్సులో రుబ్బుకోండి నిరంతరం" అన్నారు. భగవాన్ "నా మనస్సులో లక్ష గొడవలు ఉన్నాయి అంటారు అసలు మనస్సే నీవుకాదుకదా! ఆ భారాన్ని భగవంతుడి మీద పెట్టండి" అన్నారు. వయస్సు పెరిగినంత మాత్రాన వాస్తవంలో ఏ బేధం లేదు. పరిణితికి వయస్సుకు ఏసంబంధంలేదు. మనలో ఎందరో చిన్న పిల్లల మనోవృత్తులతోనే నేను-నాది అనే భావాలతో ఎదుగు పొదుగూ లేక మరణిస్తున్నారు. మనం మానసికపరిధి నుంచి కేంద్రంవైపుకు ఒక్క ఉరకవేస్తే ప్రకృతి గుర్తులు అన్నీ మాయమైపోతాయి. మనస్సు ఉపయోగకరమైన ఒక కల్పన దాన్ని నిత్య వ్యవహారాల్లో వాడుకోవచ్చు కాని దాని చేతుల్లో మోసపోకూడదు. నిజానికి మనం ఏమీ చెయ్యటం లేదు అలా ఈశ్వరుడు మన ద్వారా చేయిస్తున్నాడు వాసనను బట్టి. మనకు ప్రేమ, కోపం, కోరిక కలుగుతాయి. ఇవి అన్ని నిద్రావస్థవంటివి. మన మానసిక యాత్ర ప్రవాహం ద్వారా జరుగుతుంది. ఇలా ప్రకృతి చేతిలో మనం కీలుబొమ్మ మాత్రమే ఇందులో ఏ ప్రయోజనం లేదు. మన ఆధ్యాత్మిక ప్రగతి ఇందులో లేదు. ఇందుండి ఎదగటమే నిజమైన జీవితం ప్రారంభమౌతుంది. వాస్తవ జీవితం లేకపోవటం వల్ల పశ్చాత్తాపం ఉంటుంది. దేవుడిగా మారే కళను నేర్చుకోవటమే విద్యకు లక్ష్యం. దైవంలో ప్రతిష్ఠితమవ్వటమే మనకున్న ఒకేఒక రక్షణమార్గం. జీవితాన్ని వెదకకపోతే మనలను మరణం వెదుకుతూ వెంటాడుతుంది. విజయం పొందుతుంది. డబ్బు, అధికారం, పేరు ప్రతిష్టలు అన్నీ మరణం ముందు జీవనంలేని నీడలు. అందుకే గురుచరణాలు వదలరాదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**